జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 3-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 61 పేజీలు: 4 వెల : రూ.7

# వివాహిత.. హత్య



*** నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న వివాహేతర సంబంధం * చాకుతో మహిళ గొంతు కోసి ఆటో డ్రైవర్ * ఆటోలో మృతదేహం పొందూరు పోలీస్‌స్టేషన్‌కు * పోలీసుల ఎదుట నిందితుడు లొంగుబాటు * కన్నీరుమున్నీరవుతున్న రాజేశ్వరి కుటుంబం**



**పొందూరు, జూలై 2 (వార్త):** వివాహేతర సంబంధం మరో ప్రాణాన్ని బలికొంది. రెండు కుటుంబాలను విషాదంలో నింపింది. ఓ మహిళను చాకుతో గొంతు కోసి ఆపై పోలీస్‌స్టేషన్‌కు ఆటోలో మృతదేహాన్ని తీసుకురావడమే గాకుండా తాను కూడా పోలీసుల ఎదుట లొంగిపోయిన ఘటన పొందూరు మండలంలో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. పొందూరు మండలం చిన్న బొడ్డేపల్లి గ్రామానికి చెందిన అమలాపురపు రాజేశ్వరి (32) గత కొంతకాలంగా తన కన్నవారి ఇంటివద్ద ఉంటుంది. రాజేశ్వరి భర్త కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో కిరాణా వ్యాపారం చేసుకుంటోంది. కిరాణా సామాన్లు కొనుగోలు చేసేందుకు శ్రీకాకుళం మార్కెట్‌కు వెళ్లి సామాన్లు నిరంతరం ఒకే ఆటోలో తెస్తుండడంతో ఉర్లాం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అమజూరి గోపాల్ తో ఆమె పరిచయం ఏర్పడింది. అది కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. ఇలా కొన్నాళ్లు జరిగిన తర్వాత వీరి మధ్య చిన్నచిన్న అనుమానాలు వచ్చి వాగ్వాదాలు చేసుకునేవారు. మంగళవారం కిరాణా సామాన్లు కొనుగోలు కోసం ఆటోలో పొందూరుకు వస్తుండగా మార్గమద్యలో తోలాపి గ్రామం సమీపంలో ఆటో డ్రైవర్ గోపాల్, రాజేశ్వరి గొడవ పడ్డారు. తన జేబులో వున్న చిన్న కత్తితో రాజేశ్వరి గొంతు కోశాడు. దీంతో ఆమె మృతి చెందింది. అదే ఆటోలో పొందూరు పోలీస్ స్టేషన్‌కు గోపాల్ వచ్చాడు. ఆటోలో వున్న శవాన్ని పోలీసులుకి చూపించి లొంగిపోయాడు. పోలీసులు రాజేశ్వరి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలికి ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. తల్లి మరణించిందని



తెలిసి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఆ పాపను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. అభం శుభం తెలియని ఆ పసిపాప జీవితం తల్లి తండ్రి లేని ఒంటరి జీవిగా మారింది. విషయం తెలుసుకున్న చిన్నబొడ్డేపల్లి గ్రామస్తులు పొందూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో గందరగోళం నెలకొంది. గ్రామస్థులను అదుపు చేసేందుకు పోలీస్‌లు నానా కష్టాలు పడ్డారు. సీఐ దివాకర్ యాదవ్, పొందూరు ఏఎస్ఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజేశ్వరి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.



# మున్సిపల్ చైర్మన్‌పై దాడి



*** పోలీసులకు చైర్మన్ బల్ల గిరిబాబు ఫిర్యాదు * టీడీపీ నాయకుల దాష్టీకం* తెలుగు తమ్ముళ్ల తీరుపై సర్వత్రా విమర్శలు**

**పలాస, జులై 2 (వార్త):** పలాస టీడీపీకి చెందిన కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకుల బరితెగింపు, అత్యుత్సాహం ఆ పార్టీ నేతలకు మాయనిమచ్చగా మారుతోంది. ఏకంగా మున్సిపల్ చైర్మన్‌పై కొందరు తెలుగుతమ్ముళ్లు దాడికి దిగడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. పలాస మండలం పెద్దంచలలో, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురంలో పింఛన్ల పంపిణీలో తెలుగు తమ్ముళ్లు వివక్ష చూపించడం పట్ల పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు నిరసన వ్యక్తం చేశారు. పురుషోత్తపురం గ్రామానికి చెందిన తిరునగరి కురత్తల్వార్ స్వామీ వైసీపీ సానుభూతిపరుడంటూ పింఛన్‌ను టీడీపీ నాయకులు ఇవ్వకుండా అపేశారు. విషయం తెలుసుకున్న చైర్మన్ బల్ల గిరిబాబు సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి మాధవరావును పిలిపించి మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సాయంత్రం తిరునగరి కురత్తల్వార్ స్వామీజీకి పింఛన్ ఇప్పించాడు. అనంతరం పురుషోత్తపురం నుంచి తిరిగి వస్తుండగా చైర్మన్ గిరిబాబును వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి, టీడీపీ కార్యకర్త సప్ప నవీన్ అడ్డుకుని వాగ్వాదానికి దిగాడు. చైర్మన్ గిరిబాబు ఛాతిపై చెయ్యివేసి నెట్టేశాడు. గిరిబాబు, ఆయన సోదరుడు ఆనంద్ ను ఇద్దరిని రెండు చేతులతో మెడపై నొక్కు పెట్టి ఊపిరాడకుండా చేసేందుకు ప్రయత్నించాడు. స్థానికులు కొందరు వారిని విడిపించారు. అనంతరం చైర్మన్ గిరిబాబు తన అనుచరులు,

... మిగతా 4లో

## శ్రీకాకుళం కలెక్టర్‌గా
# స్వప్నిల్ దినకర్



**శ్రీకాకుళం, జులై 2 (వార్త):** జిల్లా కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దినకర్ తొలుత నూజివీడు ఆర్టీవోగా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2022 ఏప్రిల్‌లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళంనకు బదిలీ అయింది. ప్రస్తుత కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఈ ఏడాది ఫిబ్రవరి 1న బాధ్యతలు స్వీకరించారు. సుమారు నాలుగు నెలల పాటు జిల్లాలో సమర్థంగా సేవలందించారు. ఉన్న కొద్ది రోజుల్లో ఎన్నికల విధులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చింది. ఎన్నికల నియామవళి అమలు నుంచి పోలింగ్, లెక్కింపు ప్రక్రియ వరకు అంతా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో అధికారులను సమన్వయం చేస్తూ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా ప్రక్రియ ముగించారు. ఈయనకు స్థాన చలనం జరిగినా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.



## ఘనంగా పెంట పోలమ్మ సంబరాలు

**పలాస జులై 2(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 11వ వార్డు చిన్న బ్రాహ్మణ వీధి, పూజారి వీధుల్లో పెంటపోలమ్మ అమ్మవారి చల్లదనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నా చౌదరి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ మాజీ కౌన్సిలర్ శేఖర్ త్యాడి, సంతోష్ కుమార్ పండా, పూజారి రవి నారాయణ పండా, వాసు, సూరి, కన్న గోపాలకృష్ణ, దేవి పండా, దేవేంద్ర త్యాడి పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో రైతులకు అన్యాయం

*** సీఎం దృష్టికి నారాయణపురం ఆనకట్ట వివరాలు * ఆనకట్ట అభివృద్ధికి నిధులు తెప్పిస్తా**

*** ఆయకట్టుకు నీరందేలా చూస్తా * ఎమ్మెల్యే కూన రవికుమార్ * నారాయణపురం ఆనకట్ట పరిశీలన**

**బూర్జ, జులై 2 (వార్త):** నారాయణపురం ఆనకట్టను ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం పరిశీలించారు. ఎడమ కాలువను రెండు కిలోమీటర్ల మేర కాలి నడకన వెళ్లి దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత అయిదేళ్ల వైసీపీ పాలనలో ఇరవై ఐదు వేల ఎకరాలకు సాగు నీరు అందించే నారాయణపురం ఆనకట్ట ఎడమ కాలువను పట్టించుకోలేదన్నారు. ఈ కాలువ పూడుకు పోవడంతో రైతులకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో జైకా నిధులు 112 కోట్ల రూపాయలను మంజూరు చేస్తే జగన్మోహన్ రెడ్డి వచ్చి టిడిపి ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందని పనులు ప్రారంభించకుండా ఆనకట్టను గాలికి వదిలేశారన్నారు. ప్రస్తుతం శిథిలమై ఉన్న ఆనకట్ట సంబంధించి వివరాలను సేకరించి సీఎం దృష్టికి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన



వెంట ఇరిగేషన్ అధికారులు, తెలుగుదేశం ముఖ్య నాయకులు సనపల ఢిల్లీశ్వరరావు, నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, బీజేపీ కన్వీనర్ సూరపు నాయుడు, బూర్జ మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు

**పలాస జులై 2(వార్త):** కిడ్నీ వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు ఉన్నాయని, అలాగే వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ముందస్తు నివారణకు తగిన మందులు వచ్చాయని జర్ఖండ్ నుంచి వచ్చిన డాక్టర్లు చెప్పారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆ మందులను పీహెచ్‌సీల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. మంగళవారం కాశీబుగ్గలోని కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిని పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిపై అవగాహన పూర్తిస్థాయిలో అవసరమన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఉద్దానంలో ప్రతి గ్రామానికి మినీ ట్యాంకుల ద్వారా శుద్ధ జలాన్ని అందిస్తామన్నారు. ఉద్దాన ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తున్న కిడ్నీ మహమ్మారి మూలాలు కనుగొనేందుకు సీఎం చంద్రబాబుతో కలిసి పవన్ కళ్యాణ్ పోరాట ఫలితమే ఈ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అని తెలిపారు. 2018 సంవత్సరం ఇదే స్థలంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి ఆనాడు చంద్రబాబు భూమి పూజ చేసిన విషయం గుర్తు చేశారు. అనంతరం



వైసీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మించారే తప్ప ఎటువంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. ఆమె వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



## సంక్షేమం, అభివృద్ధి
# కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ఆమదాలవలస, జులై 2 (వార్త):** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల జనసేన నాయకులు వీర గొట్టపు బాల మురళి అన్నారు. మంగళవారం కూటమి నాయకులతో కలిసి రెండవ రోజు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలమురళీ మాట్లాడుతూ కూటమి నాయకులు రూపొందించిన ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్లు మొత్తాలను పెంచి అనుకున్న విధంగా జులై 1న లబ్ధిదారులకు అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. సంక్షేమ పథకాలను అందించడానికి అర్హులైన వారిని త్వరలోనే గుర్తించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## గుప్పెడుపేటలో విద్య అవగాహన ర్యాలీ

**పోలాకి/జలుమూరు, జులై 2 (వార్త):** పోలాకి మండలం గుప్పెడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మంగళవారం గ్రామంలో విద్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలను




ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య అందుతుందని, అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి అప్పులపాలు కావద్దని ఉపాధ్యాయులు సూచించారు.

## పూడికతీత పనులు ప్రారంభం



**సంతబొమ్మాళి, జులై 2 (వార్త):** మర్రిపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడా రాంప్రసాద్ ఆధ్వర్యంలో వంశధార 16ఆర్ చానల్ పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. రైతు సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని దానికి అనుగుణంగా టెక్కలి నియోజకవర్గంలో చిట్ట చివరి ఎకరా వరకు వంశధార నీరు అందించాలని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని రాంప్రసాద్ అన్నారు. గత ఐదు సంవత్సరాలలో వంశధార కాలువలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వ్యవసాయ మంత్రిగా అచ్చెన్నాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిగా వంశధార కాలువలపై దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో పొల్లాడ మాజీ సర్పంచ్ రఘు, వంశధార జేఈ భాస్కరరావు , పోలవరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్సును ఢీకొన్న కారు

**సంతబొమ్మాళి, జులై 2 (వార్త):** నౌపడ గ్రామంలో స్టేట్ బ్యాంకు సమీపంలో మంగళ వారం ఒక ప్రైవేట్ బస్సును కారు ఢీ కొట్టింది. ఎదురుగా వస్తున్న బస్సుని కారు రాంగ్ రూట్లో వెళ్లి ఢీ కొట్టింది. కారు ముందు భాగం నుజ్జు



నుజ్జుకాగా బస్సుకి ముందు భాగం డ్యామేజ్ జరిగింది. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**మందస, జూలై 2 (వార్త):** ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని టీడీపీ నాయకులు అవుగాన ఈశ్వరరావు, మెట్ట మహేశ్వర రావు అన్నారు. మండలంలోని సొండిపూడి, చిన్నబరంపురంలలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో వెయ్యి రూపాయల పింఛను పెంచడానికి ఐదేళ్ల కాలం తీసుకున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, మూడు నెలల పింఛను కూడా కలిపి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పింఛను అందుకున్న లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, వారిళ్లల్లో పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు. రూ.35 నుంచి రూ.4వేల వరకు పింఛన్లను తెలుగుదేశం పార్టీ మాత్రమే పెంచగలిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలబాబు, రట్టి లింగరాజు, శ్యామల సుశీల, బొచ్చ ప్రకాశ్, శిష్టు నగేశ్, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎ.నారాయణరావు, ఎం.గణపతి, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**కొత్తూరు,జులై1(వార్త):** కొత్తూరు, ఉప్పరపేట, జోగిపాడు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను వైఎస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీ వరప్రసాద్ పంపిణీ చేశారు. పేదలకు మేలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలకు గల తేడాను ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీఆర్వో ఆనందరావుకు సన్మానం



**మందస, జూలై 2 (వార్త):** వీఆర్వోగా కొర్రాయి ఆనందరావు అందించిన సేవలు మరువలేనివని తహసీల్దార్ తిరుమల బాబు అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా ఆనందరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పలువురు మాట్లాడుతూ ఆనందరావు సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, రిటైర్డ్ తహసీల్దార్ దువ్వ రామారావు,రిటైర్డ్ వీఆర్వో మామిడి మాదవరావు, సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, వీఆర్వో సంఘం అధ్యక్షుడు తులసిదాస్, వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రావు, వీఎస్ సంఘం నాయకుడు రాంబాబు, మందస మండల యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు మట్ట ఆనందరావు, కొర్రాయి అనంతదాస్, కొర్రాయి దుర్యోదన, మందస సర్పంచ్ ప్రతినిధి సిహెచ్ లక్ష్మణమూర్తి, మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

**కంచిలి, జులై 2 (వార్త):** కౌలు రైతులు గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి.ధనుంజయ్ అన్నారు. మంగళ వారం కంచిలి మండలంలో అంపురం, గొల్ల కంచిలి గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 13వ తేదీ ప్రత్యేక డ్రైవ్ ఉంటుందన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కర్లెమ్మ పంచాయతీలో పారిశుధ్య పనులు

**కొత్తూరు, జులై 2 (వార్త):** కర్లెమ్మ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన పారిశుధ్య పనులను టెక్కలి డీఎల్పీవో ఐవీ రమణ, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడుతో కలిసి పరిశీలించారు. కాలువల్లో పూడికలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మురికినీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెందవచ్చన్నారు. చెత్తను డస్ట్‌బిన్‌లలో వేయాలని సూచించారు. వారి వెంట వైస్ ప్రెసిడెంటు పోతల మణికంఠ, పంచాయతీ కార్యదర్శి సింగిరెడ్డి రామనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోతుగెడ్డ హిమగిరి, మునకాల సంతోష్, వాసు ఉన్నారు.



## కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి

**ఆమదాలవలస, జులై 2 (వార్త):** భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని వ్యవసాయ అధికారి మెట్ట మోహన్‌రావు అన్నారు. తోటాడ పంచాయతీలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఉంటే పంట రుణాలు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, రాయితీపై వ్యవసాయ విత్తనాలు, ఉత్పత్తులు, పంట కొనుగోలుతోపాటు అనేక రాయితీలు వర్తిస్తాయన్నారు. అనంతరం వరి పంటలో నారుమడి, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై వివరించారు. అలాగే భూసార పరీక్ష ఫలితాలు పత్రాలను రైతులకు అందజేశారు. సమావేశంలో బెండి రాము, తాండ్ర హరి, బుడుమూరు సీతారాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



**సంతబొమ్మాళి, జులై 2 (వార్త):** మేఘవరం సచివాలయం పరిధిలో మరువాడ పంచాయతీకి చెందిన గిన్ని నీలమ్మ అనే మహిళ అనారోగ్యంతో శ్రీకాకుళంలో చికిత్స పొందుతుంది. ఏఎన్ఎం తిరుమల శ్రీకాకుళం వెళ్లి ఆమెకు పెన్షన్ నగదు 7 వేలు అందించారు. ఏఎన్ఎం తిరుమలకు నీలమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపగా మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసరాజు అభినందించారు. తోటాడ పంచాయతీ దాసరి లక్ష్మణరావు అనారోగ్య కారణంగా శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతుంది. వెల్ఫేర్ అసిస్టెంట్ మాధవి ఆమె వద్దకు వెళ్లి పెన్షన్ 7 వేలు నగదు అందించింది.

## మానవత్వం చాటుకున్న టీడీపీ నేత



**బూర్జ, జులై 2 (వార్త):** బూర్జ మండలం నీలాదేవిపురానికి చెందిన టీడీపీ నాయకుడు కోడి గోవిందరావు మానవత్వాన్ని చాటుకున్నారు. నీలదేవీపురానికి చెందిన బంకుపల్లి రాధమ్మ అనారోగ్యం కారణంగా రాగోలు జేమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. రాధమ్మ పరిస్థితి తెలుసుకున్న గోవిందరావు గ్రామ పెద్దలతో కలిసి ఆసుపత్రికి వెళ్ళి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను అందజేశారు. కష్టకాలంలో ఆదుకున్న టీడీపీ ప్రభుత్వానికి రాధమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాధమ్మతోపాటు అదే గ్రామానికి చెందిన మజ్జి అనసూయమ్మ కూడా పాలకొండ విజయ హాస్పిటల్‌లో చికత్స పొందుతుండటంతో గోవిందరావు పెద్ద మనసుతో పెన్షన్ అందజేశారు. ఆయన వెంట లంక జగన్నాథ నాయుడు, గురాన విశ్వేశ్వరరావు, లోతుపల్లి రాజశేఖర్, నీలాదేవిపురం తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## అల్లాడలో విజయోత్సవ సంబరాలు

**జలుమూరు, జులై 2 (వార్త):** అల్లాడ గ్రామంలో మంగళవారం టీడీపీ విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని పార్టీ విజయానికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అభిమానుల మధ్య కేక్‌కి కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజేంద్ర నాయుడు ఆధ్వర్యంలో జరిగిక ఈ సంబరాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భద్రమ్మకు చల్లదనోత్సవం

* మొక్కులు చెల్లించుకున్న భక్తులు
* అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు
* బలగలో ఆధ్యాత్మిక శోభ









**శ్రీకాకుళం టౌన్, జులై 2 (వార్త):** బలగలోని భద్రమ్మ తల్లికి చల్లదనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున బలగవాసులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లి ముగ్రాటలిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు బలగ భద్రమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. బలగలో రెడ్డి గిరిజా శంకర్ ఆధ్వర్యంలో అమ్మవారి చల్లదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చింతాడలో టీడీపీ నాయకులు బోర గోవింద్, బోర రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలసి గొండు శంకర్ దంపతులు గ్రామంలో అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో పలు డివిజన్ల ఇంచార్జిలు, టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపరుస్తాం

### శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం/గార, జులై2(వార్త):** నియోజకవర్గంలో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని, జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో గ్రామీణ, గార మండలాల్లో అధికంగా తీర ప్రాంతం ఉన్నప్పటికి, సరైన సదుపాయాలు లేక మత్స్యకారులు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మినీ జెట్టి అవసరమని, దాని నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా పి.జి.పేట తీరప్రాంతం కోతకు గురవుతోందని, నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి అవకాశాలు పరిశీలించి ప్రణాళికలు తయారు చేయాలని మత్స్యశాఖ, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అక్రమ చేపల చెరువులపై అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వీటి కారణంగా మత్స్యకారులు నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మత్స్యకారుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, అవసరం మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఈ డోల తిరుమలరావు, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

**అరసవల్లి, జులై 2 (వార్త):** ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి కి వైభవంగా కళ్యాణం నిర్వహించారు. జ్యేష్ఠ బహుళ ఏకాదశి ( మతత్రయ ఏకాదశి ) పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు.మంగళవారం ఉదయం 7.50 గంటలకు కళ్యాణం ప్రాంభించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగిందని ఆలయ ఈవో ఎస్. చంద్రశేఖర్ తెలిపారు.

### పరిశ్రమలకు మంజూరు చేసిన..
# భూముల వివరాలు అందించండి

*** పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి * జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ సమూన్**



**శ్రీకాకుళం టౌన్, జులై 2 (వార్త):** పరిశ్రమలకు మంజురు చేసిన భూమి వివరాలు తక్షణం అందజేయాలని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్ పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ముందుగా పరిశ్రమల శాఖ, సంబంధిత చేనేత జౌళి, ఉద్యానవన, ఎ.పి ఫుడ్ ప్రాససింగ్ సొసైటీ, ఎపిఎంఐపి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇన్స్పెక్టర్ అఫ్ ఫాక్టోరీస్ తదితరులు చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు మంజురు చేసిన భూమి పరిశ్రమల నిర్వహణలో లేకపోతే వాటి వివరాలు, అలాగే ల్యాండ్ కావాలని కోరిన రెవిన్యూ మంజూరు చేయని వివరాలు తెలియజేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివాలని స్పష్టం చేశారు. అలాగే ఋణం మంజూరు కోసం దరఖాస్తూ పంపినప్పుడే పూర్తి స్థాయిలో దరఖాస్తూ పరిశీలించలన్నారు. జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ జిల్లాలో క్యాజు ప్రాససింగ్ యూనిట్స్, ఉత్పత్తి ఎగుమతుల వివరాలు వివరించారు. ఇంచార్జ్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రమణారావు జిల్లాలో చేపడుతున్న పనులు వివరిస్తూ జిల్లాలో 23 భారీ పరిశ్రమలు రూ. 5885.69 కోట్ల పెట్టుబడి తో స్థాపించి 12769 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. సులభతర వాణిజ్యం కింద పరిశ్రమలకు అవసరమైన అన్ని రకములైన అనుమతులు ఆన్ లైన్ ద్వారా 21 రోజులలో జారీ చేయబడుతున్నాయన్నారు. భారత ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 17 ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను ప్రారంభించిందని, సంప్రదాయ కళాకారులు చేతి పనిముట్లతో పనిచేసే క్రాఫ్ట్ వ్యక్తులకు గుర్తింపు సంపూర్ణ మద్దతును అందిస్తుందని చెప్పారు. సమావేశంలో డిఆర్డిఏ పి.డి కిరణ్ కుమార్, జియస్టి నుండి సిటిఓ రాణిమోహన్, ఎల్డీయం సూర్యకిరణ్, డ్వామా మేనేజర్ మురళీ, మైనింగ్ ఎడి సత్యనారాయణ, ఎపిఎంఐపి పి.డి శ్రీనివాస్, ఎపిఇపిడిఎల్ ఈఈ పాత్రుడు, చేనేత జౌళిశాఖ ఎడి సాయిప్రసాద్ ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రామా రావు, రఘునాథ్ రావు, ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ రాంబాబు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.




## రేషన్ వాహనంపై జగన్ బొమ్మ తొలగించండి

**సారవకోట/జలుమూరు, జులై 2 (వార్త):** సారవకోట మండలం బుడితిలో రేషన్ పంపిణీ చేస్తున్న వాహనంపై జగన్మోహనరెడ్డి బొమ్మను తొలగించాలని టీడీపీ అధ్యక్షుడు కత్తిరి అధికారులను కోరారు. ప్రభుత్వం మారినప్పటికీ ఇంకా జగన్మోహనరెడ్డి ఫొటో ఉండడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



**బూర్జ, జులై 2 (వార్త):** మండలంలోని ఉవ్వపేట గ్రామానికి చెందిన బి.సూరిబాబు మంగళవారం తన ద్విచక్ర వాహనంపై కుమార్తెను తీసుకుని వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో సూరి బాబు, అతని కుమార్తెకు గాయాలయ్యాయి. 108 వాహనంలో పాలకొండ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం కిమ్స్కు తరలించారు. సూరి బాబు బూర్జ పోలీస్లకు ఫిర్యాదు చేశాడు.

## ఐటీఐ కుర్రాడి వినూత్న ప్రయోగం



**బూర్జ, జులై 2 (వార్త):** మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన కందల పవన్ కుమార్ వినూత్న ప్రయోగం చేసి అందరి మన్ననలు పొందాడు. ఐటీఐ చదువుతున్న పవన్ ద్విచక్ర వాహనం ఇంజనుతో పవర్ టిల్లర్ను తయారు చేశాడు. దీనితో పొలంలో దుక్కి దున్నాడు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ రైతులు పొలం దుక్కిదున్నటానికి, పత్తి పొలంలో కలుపు నివారణకు, దుక్కికోసం ట్రాక్టరు వాడుతున్నారని, ట్రాక్టరుకు గంటకు ఐదు లీటర్లు డీజిల్ ఖర్చు అవుతుందని తెలిపారు. ఆ ఖర్చును రైతులు భరించే పరిస్థితి లేదన్నారు. రైతులు పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకుని బైకు ఇంజనుతో పవర్ టిల్లర్ తయారుచేశానన్నాడు. ఈ పవర్ టిల్లరుకు ఎనిమిది వేల రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుందని, గంటకు లీటర్ పెట్రోల్ మాత్రమే సరిపోతుందని పవన్ కుమార్ తెలిపాడు. ప్రతీ సన్నకారు రైతు కొనుక్కోవడానికి ధర అందుబాటులో ఉంటుందన్నాడు. అలాగే ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందితే మరిన్ని పవర్ టిల్లర్లను తయారుచేసి రైతులకు అందిస్తానన్నాడు.

## విలేజ్ సర్వేయర్ తిరుపతిరావుకు అభినందన



**కొత్తూరు, జులై2 (వార్త):** పారాపురం సచివాలయంలో విలేజ్ సర్వేయర్గా విధులు నిర్వర్తిస్తున్న అల్లు తిరుపతి రావును పలువురు అభినందించారు. పారాపురం సచివాలయం పరిధిలోని కలిగాం గ్రామానికి చెందిన ఎన్ని పోలినాయుడు అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్లో చికిత్స పొందుతున్నాడు. పెన్షన్ అందుకోవడానికి రాలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో తిరుపతి రావు రిమ్స్కు వెల్లి పోలినాయుడుకు రూ. 7వేలు పింఛనును అందించాడు. దీంతో గ్రామ సర్పంచ్ సనపల కోటేశ్వరరావుతో పాటు గ్రామస్థులు తిరుపతిని అభినందించారు.

### రిమ్స్ మెడికల్ కళాశాల
## సూపరింటెండెంట్గా సాయిరాం



**శ్రీకాకుళం టౌన్, జులై 2 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం గవర్నమెంట్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్గా పదోన్నతి పొందారు. మంగళవారం సాయిరాం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్టివో డి.వి. రమణ, ట్రెజరీ అకౌంటెంట్ శ్రీనివాస్ తోపాటు పలువురు ఉద్యోగులు హనుమంతు సాయి రాంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పండగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ




**కొత్తూరు, జులై 2 (వార్త):** కొత్తూరు పంచాయతీలో సోమవారం ఉదయం నుంచి ఎన్టీఆర్ భరోసా తొలివిడత పెన్షన్ కార్యక్రమం పండగలా సాగింది. సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోతుగడ్డ తాతబాబు, పొగిరి అర్జున్, పెద్దిన అమర్, టొంపల తిరుపతి, లోతుగడ్డ జనార్ధన్ పాల్గొన్నారు.

## 439 రోజుకు అన్నాక్యాంటీన్

**శ్రీకాకుళం టౌన్, జులై 2 (వార్త):** ఎమ్మెల్యే గొండు శంకర్ ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ మంగళవారం 439వ రోజుకు చేరింది. ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. ప్రభుత్వం అన్నాక్యాంటీన్ ఏర్పాటు చేసే వరకూ ఈ మొబైల్ అన్నా క్యాంటీన్ ఉంటుందని గొండు శంకర్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.



### జర్నలిస్టులకు టోల్ ఫీజు నుంచి
# మినహాయింపు ఇవ్వండి
**కేంద్ర హైవే, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్గారిని కోరిన ఎంపీ కలిశెట్టి**



**శ్రీకాకుళం, జులై2 (వార్త):** ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ, ఆయా జాతీయ రహదారులపై వసూలు చేసే టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర హైవేలు, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్గారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మంగళవారం ఇదే విషయమై కేంద్ర హైవేలు, రోడ్డు రవాణా శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రేకింగ్ న్యూస్, న్యూ స్టోరీస్, పౌర సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ముఖ్యమైన వ్యక్తుల ఇంటర్వ్యూలు కోసం.. తమ సొంత ఖర్చులతో, తమ అధికార పరిధిలో జర్నలిస్టులు తిరుగుతున్నారని.. సమాజ శ్రేయస్సుతో పాటు వార్తల పట్ల ఉన్న ఆసక్తి, అంకితభావం, నిబద్ధత కారణంగా టోల్ ఫీజు ఖర్చుల కోసం జర్నలిస్టులు తమ సొంత డబ్బును వెచ్చిస్తున్నారని అప్పలనాయుడు విన్నవించారు. తానొక తెలుగు దినపత్రికలో రిపోర్టర్గా పని చేశానన్నారు. జర్నలిస్టుల మనోవేదనను మీ దృష్టికి తీసుకువస్తున్నానన్నారు.

## మున్సిపల్ చైర్మన్పై దాడి

(మొదటిపేజి తరువాయి)

వైసిపి కౌన్సిలర్లతో కలిసి దాడి సంఘటనపై కాశీబుగ్గ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత చైర్మన్ గిరిబాబు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో పార్టీలకతీతంగా వలంటీర్ల ద్వారా అర్హులైన అందరికీ పింఛన్ పంపిణీ చేశామన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి కేవలం 30 రోజుల్లోనే తమ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారని దీన్ని ప్రజలు గమనించాలన్నారు. వైసీపీ పాలనలో ఇలాంటి దౌర్జన్యాలు, కక్ష సాధింపు చర్యలు ఏనాడు చేపట్టలేదన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413